

5 వరకూ ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు ఛాన్స్

ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2025 ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 3, 4, 5వ తేదీల్లో ఇంటర్మీడియట్ బోర్డు అవకాశం కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 12వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల పరీక్ష ఫీజు గడువు ఏప్రిల్ 25వ తేదీతో ముగిసిందని, విద్యార్థుల శ్రేయస్సు కోసం ఫీజు చెల్లించని విద్యార్థులకు ఇంటర్ విద్యామండలి చివరి అవకాశం కల్పించిందని, విద్యార్థులు తాము చదువుతున్న కళాశాలలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఈ తేదీల తరువాత పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఎటువంటి అవకాశం ఉండదని, పరీక్ష ఫీజు చెల్లించాలనుకున్న విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కాలువల్లో నీరు పారేదెలా..!

- డెల్టా ఆధునికీకరణ పనులపై నిర్లక్ష్యం
- ఈ ఏడాదీ తాత్కాలిక ఓఅండ్ఎం పనులతోనే సరి
- ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వ ఆమోదం కరువు
- ప్రభుత్వాలు మారినా ఆధునికీకరణపై అదే తీరు
- జూన్ మొదటి వారంలో కాలువలకు సాగునీరు విడుదల
- కొల్లేరు పంట కాలువల్లో ఆధునికీకరణ పనులు ఎలా?



ఉండి మండలం వెంకయ్య వయ్యేరు కాలువ ఇలా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డెల్టా ఆధునికీకరణపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. వైసిపి ప్రభుత్వం తీరులోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీంతో ఈ ఏడాది కాలువల్లో పూడిక తీసే పనులు 'ఎక్కడి వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు పరిస్థితి తయారైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గోదావరి నుంచి వచ్చే నీటితో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో ఆయకట్టు సాగువుతోంది. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీటి సరఫరా సాగవుతోంది. 2007లో దాదాపు రూ.1400 కోట్లతో ప్రారంభించిన డెల్టా ఆధునికీకరణ పనులు నేటికీ సగం కూడా పూర్తి కాని పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్ల వైసిపి పాలనలో కాలువల పూడికతీత పనులు పూర్తిగా పడకేశాయి. దీంతో పంట కాలువలు మెరకతేరిపోయి చిన్నపాటి వర్షానికి సైతం పంట పొలాలు మునుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం రావడంతోపాటు ఇరిగేషన్ మంత్రిగా జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడు ఉండటంతో ఆధునికీకరణ పనులు చకచకా సాగిపోతాయని అంతా భావించారు. పరిస్థితి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి దాదాపు రూ.400 కోట్లకుపైగా నిధులు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం పంపించారు. మే నెల వచ్చినా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆమోదమూ రాలేదు. దీంతో ఆధునికీకరణ పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. తాత్కాలిక ఓఅండ్ఎం పనులు మాత్రమే సాగుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.11 కోట్లకు సంబంధించిన పనులు మాత్రమే సాగుతున్నాయి. ఏలూరు జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఏప్రిల్ 27న కాలువలకు నీరు నిలుపుదల చేశారు. నిబంధనల ప్రకారం కాలువలకు నీటిని నిలుపుదల చేసే సమయానికి టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభిస్తే నెల రోజులకుపైగా పనులు సాగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ప్రతియేటా జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేస్తోంది. మే నెలలోనే ఆధునికీకరణ పనులు చేసే అవకాశం ఉంది. అధికారుల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయకపోవడంతో ఈ ఏడాది ఆధునికీకరణ పనులు లేకుండాపోయాయి.

ప్రతియేటా వేల ఎకరాల్లో పంటనష్టం

పంట కాలువలు పూడిపోవడంతో ప్రతియేటా వేల ఎకరాల్లో పంటనష్టం జరుగుతోంది. గడిచిన ఖరీఫ్‌లోనూ దాదాపు 16 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు అధికారులు తేల్చారు. దీనికి ప్రధాన కారణం ఆధునికీకరణ జరగకపోవడమే. కాలువలు మెరకదేరిపోవడంతో వర్షాలకు పంట పొలాల్లోంచి నీరు కిందకు పారడం లేదు. రోజుల తరబడి పొలాల్లోనే ఉండిపోతున్నాయి. దీంతో పంట కుళ్లిపోయి దెబ్బతింటుంది. రైతులు పెద్దఎత్తున నష్టపోతున్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వచ్చే ఏడాది సైతం రైతులు కష్టాలు ఎదుర్కోక తప్పదని స్పష్టమవుతోంది.

కొల్లేరులో పంట కాలువల్లో పనులపై ఆంక్షలు

కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల్లోనూ పంట కాలువల ద్వారా నీరంతా కొల్లేరులోకి వెళ్తోంది. వర్షపు నీరంతా కాలువల ద్వారా కొల్లేరులోకి చేరి ఉప్పుటేరు గుండా సముద్రంలోకి చేరుతోంది. కొల్లేరులో కాలువలు పూడుకుపోవడంతో వరద నీరు కిందకు దిగక పంట పొలాలు దెబ్బతింటున్నాయి. రబీలోనూ కాలువల్లో నీరు కిందకు పారక నీటి ఎద్దడి సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాదైనా కొల్లేరులో ఉన్న పంట కాలువల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. కొల్లేరు కాంటూరు లెక్కలు చెప్పి ఫారెస్ట్ అధికారులు దీన్ని అడ్డుకుంటున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొల్లేరులోని పంట కాలువల్లో పూడిక తీయకపోతే వచ్చే ఖరీఫ్, రబీల్లో సైతం తీవ్ర ఇబ్బందులు తప్పవని, కొల్లేరులోని పంట కాలువల్లో ఆధునికీకరణ పనులు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు వెంటనే తీసుకోవాల్సి ఉంది.

ప్రభుత్వం.. మా ధాన్యం కొనాలి

ఏలూరు కలెక్టరేట్ ఎదుట రైతులు, కౌలురైతుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'మా ధాన్యం ప్రభుత్వం కొనాలి' అంటూ రైతులు శనివారం ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన జిల్లా కలెక్టరేట్ ఎదుట మండుటెండలో బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ కార్యాలయం ముందు రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు టార్గెట్లు పెంచి తమ ధాన్యం కొనుగోలు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయ్యిందని, రబీ ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడం దారుణమని విమర్శించారు. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. జిల్లాలో సుమారు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా కాగా ఇందులో 2.20 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించి, ఆ మేరకు కొనుగోలు చేసి లక్ష్యం పూర్తయిందనే పేరుతో మిగిలిన ధాన్యం కొనుగోలు చేయకపోవడం అన్యాయమన్నారు. కొన్నిచోట్ల లారీలు, ట్రాక్టర్లలోకి లోడ్ చేసిన ధాన్యం మూడు రోజులుగా రైతుసేవా కేంద్రాల వద్ద ఉండిపోయాయని చెప్పారు. ఏలూరులోని వెంకటాపురం రైతుసేవా కేంద్రం వద్ద లారీ, ట్రాక్టర్‌లోకి లోడ్ చేసిన ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో కౌలు రైతు బైరెడ్డి లక్ష్మణరావుకు కిరాయి పెరిగి లబోదిబోమంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏలూరు మండలంతోపాటు దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు తదితర మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం టార్గెట్లు పెంచే వరకు ధాన్యం కొనుగోలు చేయలేమని జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులు చేతులెత్తేయడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం వెంటనే పెంచి రైతులు, కౌలురైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామ్మూర్తికి రైతుసంఘం నాయకులు, కౌలురైతులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు బైరెడ్డి లక్ష్మణరావు, బోనగిరి కనకరాజు, తిరుమలశెట్టి జగదీశ్వరరావు, ఆకిరి నాగరాజు, తోట వెంకట సత్యనారాయణ, తిరుమలశెట్టి లీలా మాధవరావు, బాలాజీ, పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, రైతు సంఘం నేతలు

నీట్ పరీక్షకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లాలో ఆదివారం నీట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష నిర్వహించేందుకు ఏలూరు నగరంలో పలు పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలో ఉన్న కేంద్రీయ విద్యాలయ, ఏలూరు నగరంలోని కోటదిబ్బ జూనియర్ కళాశాల, అదే ప్రాంతంలో ఉన్న కస్తూరిబా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ పాఠశాల, గోపన్నపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్, ఎఎస్‌పి సూర్యచంద్రరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ సంయుక్తంగా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సులువుగా చేరేందుకు సంబంధిత కూడళ్ల వద్ద సహాయక కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, ఏలూరు వన్‌టౌన్ సిఐ సత్యనారాయణ, టూటౌన్ సిఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

చేపల చెరువులకు గేట్లు ఎత్తేశారు..!

గురజ సర్‌ప్లస్ ఎస్కేప్ పోల్‌రాజ్ కాలువ షటర్ ఎత్తివేత


పత్తాలేని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో పోల్‌రాజ్, సిబి కెనాల్ పరిధిలోని ఆయకట్టు గ్రామాల్లో తాగునీటి చౌర్యం జోరుగా సాగుతోంది. జల వనరుల శాఖ అధికారుల అండదండలతో తాగునీటి చెరువుల్లో నింపాల్సిన నీటిని ఆక్వా రైతులు దారి మళ్లించి చేపల చెరువులు నింపుకుంటున్నారు. జల వనరుల శాఖ జోక్యంతోనే నీటి చౌర్యం జరుగుతున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి. శనివారం మండలంలోని రెండు ప్రధాన పంట కాలములను పరిశీలించగా భారీఎత్తున నీటి చౌర్యం కనిపించింది. పోల్‌రాజ్ కెనాల్ పరిధిలో మానికొండపాడులో ఏర్పాటుచేసిన సర్‌ప్లస్ ఎస్కేప్ పోల్‌రాజ్ కాలువ (వైరు) షట్టర్ ఎత్తివేశారు. దీంతో నియోజకవర్గ శివారుకు వెళ్లాల్సిన తాగునీరు పోల్‌రాజ్ మురుగు కాలువ ద్వారా చేపల చెరువులకు మళ్లించినట్లయ్యింది. పోల్‌రాజ్ మురుగు కాలువ ద్వారా పెయ్యేరు, పేరూరు, దాకారం తదితర గ్రామాల్లోని చేపల చెరువులకు నీటిని మళ్లించారు. వరదలు, భారీ వర్షాలు వచ్చినప్పుడు మాత్రమే ఈ గేటు ఎత్తి వరదనీటిని బయటకు మళ్లిస్తారు. అలాంటిది తాగునీటిని మురుగు కాలవ ద్వారా చేపల చెరువులకు వదిలేశారు. అలాగే సిబి కెనాల్ పరిధిలో చినగొన్నూరు నుంచి కాకరవాడ దిగువ గ్రామాల వరకు కాలువ ఆయకట్టు పరిధిలోని వందలాది చేపల చెరువులకు తాగునీటిని విద్యుత్ మోటార్లతో తోడేస్తున్నారు. ఈ రెండు కాలువల పరిధిలో నీటి చౌర్యం జోరుగా సాగుతుంది. ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రింబవళ్లు ఆక్వా రైతులు కాలువలోని నీటిని కరెంట్ మోటార్లతో తోడేస్తున్నారు. నియోజకవర్గ శివారు గ్రామాలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. నీటిచౌర్యం జరగకుండా అధికారులు, పోలీస్, సచివాలయం, రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేసినప్పటికీ ఈ టీములు ఎక్కడా కాలువ గట్లపై కన్పించిన దాఖలాలు లేవు. నీటి చౌర్యం విషయమై లస్కర్ రాంబాబును వివరణ అడగ్గా పోల్‌రాజు కాలువ పొంగిపొర్లుతుందని, కాలువ గట్ల పైనుంచి నీరు ప్రవహిస్తుందని, కాలువ గట్లకు గండి పడకుండా ఉండేందుకు అధికారుల ఆదేశాలతోనే తాను మానికొండపాడు వద్ద అత్యవసర షట్టర్‌ను ఎత్తివేసినట్లు తెలిపారు. దీనిపై జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆంజనేయ ప్రసాద్‌ను వివరణ కోరగా విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్లు కట్టివేసామని, నీటి చౌర్యం విషయం కైకలూరు డిఇని అడగాలన్నారు. ఈ విధంగా అధికారులు ఒకరిపై ఒకరు అని చెబుతూ, పొంతన లేని సమాధానాలు చెబుతుండటం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పోల్ రాజ్ కాలువ నుంచి ఆక్వా చెరువులకు వెళ్తున్న నీరు




సీబీ కెనాల్ నుంచి మోటార్ల ద్వారా తోడుతున్న నీరు

పిజిఆర్ఎస్ దరఖాస్తుదారులకు కలెక్టర్ ఫోన్

సమస్య పరిష్కారంలో సంతృప్తిపై ఆరా

దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిందే

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం



ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారంపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఫిర్యాదుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా తమ సమస్యలను తెలియజేసుకున్న దరఖాస్తుల్లో సమస్యలు పరిష్కారమైన ప్రజలకు శనివారం సాయంత్రం కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్వయంగా ఫోన్ చేసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. నూజివీడు మండలం బొర్వాంచ గ్రామానికి చెందిన గ్రామస్తులు రీసర్వేలో తన భూమి విస్తీర్ణం తగ్గిందని ఒకరు, తనకు పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేయలేదని మరొకరు వినతులు సమర్పించగా, సదరు దరఖాస్తులను పరిశీలించిన అధికారులు సమస్యలను పరిష్కరించారు. సదరు పరిష్కార విధానంపై దరఖాస్తుదారులను కలెక్టర్ వెట్రిసెల్వి నేరుగా ఫోన్ చేసి మీ వద్దకు వచ్చి సమస్య గురించి తెలుసుకున్నారా.. దరఖాస్తుదారుల పట్ల అధికారుల ప్రవర్తన, మాటతీరు, తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు, మండవల్లి మండలం గన్నవరం గ్రామాలకు చెందిన గ్రామస్తులు తమ గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా లేదని, చెత్తను తొలగించడం లేదని ఫిర్యాదు చేయగా అధికారులు వాటిని పరిష్కరించారు. వీటిపై సదరు దరఖాస్తుదారులకు కలెక్టర్ వెట్రిసెల్వి నేరుగా ఫోన్ చేసి, పరిష్కార విధానం, వారి సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. ఇదే విధంగా పలువురు దరఖాస్తుదారులకు ఫోన్ చేసి వారి దరఖాస్తుల పరిష్కార విధానంపై సంతృప్తి చెందారా.. అధికారుల ప్రవర్తన తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో అధికారులందరూ తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలని, దరఖాస్తుదారుని కలిసి వారి సమస్యలను తెలుసుకుని నాణ్యమైన రీతిలో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు



ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో...

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఐదో రోజు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో విద్యార్థులు ఎంతో సంతోషంగా పాల్గొన్నారు. తొలుత ఈ శిక్షణా తరగతులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు పాల్గొని శిక్షణా తరగతులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకులు ఎమ్‌డి.అస్లాం, బివిఎస్.లక్ష్మి, విద్యార్థులతో కథలు చెప్పించడం, చదవడం మాకిష్టం, నీతికథలు చదివించడం వంటివి చేశారు. అనంతరం సీనియర్ రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు యోగా క్లాసులు, (పేపర్ క్రాఫ్టులతో) రంగు రంగు కాగితాలతో బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు మధ్యలో కొంత సమయాన్ని విరామం కలిగించి స్నాక్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ పి.శంకర్, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు : బాలల గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారంశెట్టి రమేష్‌బాబు గారిచే విద్యార్థులకు నీతి కథలు చెప్పించడం, చదవడం నేర్పించారు. అనంతరం విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ బి.బృందాచే క్లాసికల్ డ్యాన్స్, జి.పవన్‌కుమార్‌చే డ్రాయింగ్‌లో మెలకువలు, అంకెలతో బొమ్మలు గీయడం నేర్పించారు. విద్యార్థులకు విరామ సమయంలో అల్పాహారం అందించారు. ఈ శిక్షణా తరగతులు జూన్ ఆరో తేదీ వరకు కొనసాగుతాయని, ఆసక్తి గల విద్యార్థులు పాల్గొని వినియోగించుకోవాలని గ్రంథాలయ నిర్వాహకురాలు శోభ తెలిపారు. రికార్డు అసిస్టెంట్ ఎం.కీర్తి తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పలరాజుగూడెంలో పొంచి ఉన్న ప్రమాదం

ఆర్అండ్‌బి రోడ్డుపై ప్రమాదకరంగా గొయ్యి

ఆందోళనలో వాహనదారులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - టి.నరసాపురం


ప్రభుత్వాలు మారినా ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. రోడ్ల అభివృద్ధికి రూ.కోట్ల నిధులు విడుదల చేశామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ మండలంలో కొన్ని రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రధానంగా మండలంలోని అప్పలరాజుగూడెంలో ఆర్అండ్‌బి రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. వాహనదారులు నిత్యం వాహన రాకపోకలు సాగించే ఈ రోడ్డులో టి.నరసాపురం, పుట్రేపు, మక్కినవారిగూడెం వంటి ప్రాంతాల నుంచి అప్పలరాజుగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం, రాజమండ్రి ప్రాంతాలకు ప్రయాణించడానికి ఈ రోడ్డు ప్రధాన రహదారిగా ఉంది. అయితే గత కొంతకాలంగా రోడ్డుపై ఏర్పడిన గొయ్యి క్రమేపీ పెరుగుతూ పెద్దదిగా మారింది. ఇళ్లల్లో వాడి వదిలేసి వ్యర్థపు నీరు గోతిలో చేరి చెరువును తలపిస్తోంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం వాహనదారులు, ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత బండివారిగూడెం నుంచి అప్పలరాజుగూడెం వరకు మరమ్మతులు చేపట్టారు. కాని అక్కడక్కడ అధ్వాన్నంగా ఉన్న కొన్ని గోతులు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో పలుచోట్ల ఉన్న గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏక్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి వాహనదారులకు సౌకర్యవంతమైన రోడ్లు నిర్మించాలని, అదేవిధంగా మండలంలో అధ్వానంగా ఉన్న టి.నరసాపురం -మక్కినవారిగూడెం, మర్రిగూడెం రోడ్లు కూడా అభివృద్ధి చేయాలని సిపిఎం, ఇతర సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

అధ్వానంగా ఉన్న రోడ్లు వెంటనే అభివృద్ధి చేయాలి

గుడెల్లి వెంకట్రావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు



మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లు వెంటనే ప్రభుత్వం అభివృద్ధి చేయాలి. మండలంలో అప్పలరాజుగూడెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం గ్రామాలకు వెళ్లే రోడ్లపై గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు మారినా రోడ్ల అభివృద్ధి శూన్యం. గుంతలన్నీ పూడుస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది కాని అభివృద్ధికి మాత్రం నోచడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి చేయాలి. లేకపోతే ఆందోళనలు చేపడతాం.

అర్హులందరికీ పెన్షన్ అందిస్తాం


ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఫెన్షన్ అందించనున్నట్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఎంఎల్ఎ కార్యాలయానికి వచ్చి ఎంఎల్ఎ బడేటి చంటికి వినతులు అందించారు. వాటన్నింటినీ స్వయంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. అలాగే పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్ఛాలు అందించారు. పలువురు ఆయనకు ఆహ్వానపత్రికలు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఫెన్షన్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తనను కలుసుకోవాలని ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి


మొక్క నాటుతున్న జాకీర్‌హుస్సేన్

ప్రతిఒక్కరూ పుట్టినరోజునాడు మొక్క నాటాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రతిఒక్కరూ పుట్టినరోజున మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని రాజా వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.జాకీర్‌హుస్సేన్ అన్నారు. మండలంలోని బండివారిగూడెంలో కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం రాజా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బచ్చు చిన్న రామాంజనేయులు పుట్టినరోజు సందర్భంగా సచివాలయం ఆవరణలో రాజా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ మామిడి మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం రక్షించబడుతుందన్నారు. పుట్టిన రోజున మొక్కలు నాటడం అలవాటుగా పెట్టుకున్న రాజా వెల్ఫేర్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు సుంకర సాంబ శివ రాయలును అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి యశోద, వెంకటేశ్వరరావు, సచివాలయ మహిళా పోలీస్ సాయి ప్రసన్న, నరసింహారావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమికి బలం

ప్రజాశక్తి - ముసునూరు

పచ్చిరొట్ట విత్తనాలతో భూమి బలంగా తయారవుతుందని ఎడిఎ అల్లూరి చాముండేశ్వరి తెలిపారు. మండల కేంద్రమైన వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కె.చినసూరిబాబు ఆధ్వర్యంలోని వ్యవసాయ క్షేత్ర పరిశీలన అధికారుల సిబ్బందికి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో దిక్కులు కలయ దున్నించి ఖరీఫ్ వర్షాకాలం సీజన్ మొదలయ్యే సమయంలో పచ్చిరొట్ట విత్తనాలు భూమిలో చల్లిస్తే రైతులకు ఎరువుల వలే ఉపయోగపడుతుందని, ఆ విషయం రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రజలకు, పాలకులకు వారధి పాత్రికేయులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పాలకులకు ప్రజలకు వారధిగా ఉంటూ ప్రభుత్వాలు మంచి పాలనను అందించడంలో పత్రికా రంగం కీలక పాత్ర పోషిస్తుందని కాగుపాడు మాజీ సర్పంచ్, టిడిపి మండల కమిటీ పూర్వ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ అన్నారు. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ కడియాల రవిశంకర్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కాగుపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ ఆధ్వర్యంలో ఉంగుటూరు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముప్పన భుజంగరావు, ఉపాధ్యక్షులు గుత్తికొండ ప్రవీణవారావు, కార్యదర్శి పి.వి.సత్యనారాయణ, కోశాధికారి ఆర్ల వీరాస్వాములను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇన్‌ఛార్జి సర్పంచి పొట్ల ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి సూరపురెడ్డి దుర్గారావు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

నలుగురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని జాతీయ రహదారి-45 గోపాలపురం వద్ద ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడి నలుగురు స్వల్ప గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఎస్ఎఆర్ ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం బయలు దేరింది. సుమారు శనివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో జాతీయ రహదారి -45 ద్వారకాతిరుమల మండలం గోపాలపురం వద్ద వాలిన ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదవశాత్తు రోడ్డు కుడి పక్కన డివైడర్ వాలిన ఢీకొని బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు స్వల్ప గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయాలపాలైన నలుగురిలో సెకండ్ డ్రైవర్ పెదపల్లి రాము, క్లీనర్ దుర్గలను ఏలూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరికి ఫస్ట్ ఎయిడ్ చేసి ఇతర బస్సుల్లో వారి స్వస్థలానికి పంపించారు.


బోల్తా పడిన బస్సు

గుర్తు తెలీని వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తుతెలీని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలోని పవర్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఏలూరు రెండో పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పవర్‌పేట స్టేషన్ సమీపంలోని బోసుబొమ్మ దగ్గర గుర్తు తెలీని 35 ఏళ్ల వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఉన్నాడన్న సమాచారాన్ని స్థానికులు పోలీసులకు అందించారు. వెంటనే ఎస్ఐ నాగేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు ఒంటిపై చొక్కా లేకుండా జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. రోడ్డు పక్కనే మృతి చెంది ఉండటంతో మద్యం ఎక్కువ కావడంతో మృతి చెందాడా, మరేదైనా కారణాలతో మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైండోవర్ ఉల్లంఘన

రూ.3 వేలు జరిమానా

ప్రజాశక్తి - టి.నరసాపురం

నవోదయం 2.0లో చింతలపూడి స్టేషన్ పరిధిలో పాత నాటుసారా కేసులో నిందితుడు అయిన టి.నరసాపురం మండలం కొత్తగూడెనికి చెందిన బండి మరియదాసుకు తహశీల్దార్ రూ.మూడు వేలు జరిమానా విధించినట్లు చింతలపూడి ఎక్సైజ్ అధికారి శనివారం తెలిపారు. మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ 129 బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం సత్ ప్రవర్తనతో మెలగుతానని మరియదాసుకు బైండోవర్ బాండ్ జారీచేయగా సదరు బాండ్‌ను ఉల్లంఘించి మళ్లీ కొత్తగా నాటు సారా కేసులో నిందితుడిగా పట్టుబడటంతో సదరు బైండోవర్ బాండ్‌ను ఉల్లంఘించినందుకు ఆయనకు జరిమానా విధించి చెల్లించాలని మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తి రూ.మూడు వేల జరిమానాను చలనా రూపంలో ప్రభుత్వం వారికి బ్యాంకులో చెల్లించినట్లు తెలిపారు.

భార్య కన్పించడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆసుపత్రికి అని చెప్పి వెళ్లిన తన భార్య కన్పించడంలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగర పరిధిలో మొక్కల అనూష తన కుమారుడుని తీసుకుని శుక్రవారం మధ్యాహ్నం ఆసుపత్రికి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో భర్త రాంబాబు అన్ని చోట్ల వెతికాడు. ఎక్కడా ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం రాత్రి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భానుడి ప్రతాపం.. రోడ్లు నిర్మానుష్యం

వేసవిలో తగిన జాగ్రత్తలు తప్పనిసరని వైద్యుల సూచన

ప్రజాశక్తి - కుక్కునూరు

ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు మించి నమోదవుతున్నాయి. దీంతో పది గంటలు దాటితే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. దుకాణాలు పగటిపూట బంద్ చేసి సాయంత్రం సమయంలో తెరుస్తున్నారు. 48 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటితే వడగాల్పులు వీచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. విపరీతంగా ఎండలు కాసే సమయంలో విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు, కూలీలు బయట తిరగొద్దని వైద్యులు సూచిస్తున్నారు. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడి గాలులు, వడదెబ్బ, సన్ స్ట్రోక్, డి హైడ్రేషన్‌కు గురవుతారని, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకమని చెప్పారు. మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో ఎక్కువగా తిరగరాదని సూచించారు. సూర్యకిరణాలకు, వేడి గాలికి గురికాకూడదన్నారు. ఎండ వేళల్లో శరీరంపై భారం పడే శ్రమ పనులు చేయరాదని, నలుపు, ముదురంగు ఉన్న దుస్తులు ధరించరాదని, మాంసాహారం తగ్గించాలని, మద్యం సేవించరాదని, నీళ్ల పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ఇంటి పట్టునే ఉండాలని, బయటకు వెళ్లి వస్తే గొడుగు, టోపీ తీసుకుని వెళ్లాలని సూచించారు. లేకపోతే వడదెబ్బ తగిలే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని,వీలైనంత త్వరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

త్వరలో వైసిపి నియోజకవర్గ, మండల, గ్రామ నూతన కమిటీలు

దెందులూరు మాజీ ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి

ప్రజాశక్తి - దెందులూరు

వచ్చే నెల లోపు వైసిపి దెందులూరు నియోజకవర్గ మండల గ్రామ అనుబంధ విభాగాల నూతన కమిటీలు నియామకం జరుగుతుందని దెందులూరు మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి క్షేత్రస్థాయిలో బలోపేతం, అభివృద్ధి, సమన్వయం లక్ష్యంగా పార్టీ అధినేత, మాజీ సిఎం జగన్ ఆశయసాధన లక్ష్యాలకు అనుగుణంగా దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి నూతన రాష్ట్ర జిల్లా కమిటీల నియామకాల కోసం ఇప్పటికే రాష్ట్ర కమిటీకి పేర్లు సిఫార్సు చేసినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం, సమన్వయానికి సేవలందించిన కార్యకర్తలు, నాయకులకు పార్టీ అధిష్టానం సముచిత గుర్తింపు గౌరవం ఇవ్వనున్నట్లు తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఎస్ఐ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ద్విచక్రవాహనదారులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ అన్నారు. ఏలూరు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దుర్గాప్రసాద్ వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో అనేకమంది మృత్యువాత పడడానికి కారణం హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడమేనని ఆయన వారికి గుర్తు చేశారు. ఏ సందర్భంలోనైనా రోడ్డు ప్రమాదానికి గురైతే వారు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం నుంచి కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలను పాటించి మాత్రమే వాహనాలు నడపాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు డిఎస్‌సి మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉచిత డిఎస్‌సి మెటీరియల్ నిరుద్యోగులు వినియోగించుకుని ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని అంబేద్కర్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకుడు జోడాల వెంకట్ ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో అంబేద్కర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు డిఎస్‌సి మెటీరియల్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 72 మంది నిరుద్యోగులకు రూ.30 వేల విలువైన డిఎస్‌సి మెటీరియల్ అందించినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో ఆర్థికంగా వెనుకబడిన యువత ఉద్యోగాలు సాధించాలనే సంకల్పంతో మెటీరియల్ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 501 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన సూరం జగన్‌కు రూ.1500, ద్వితీయ స్థానం సాధించిన నల్లమిల్లి మమతకు రూ.వెయ్యి నగదు అందించారు. ఈ కార్యక్రమంలో గుమ్మళ్ల వెంకటేశ్వరరావు, కలపర్తి శ్రీనివాస్, కలపర్తి రాజు, అందుగుల వెంకట్, బుడుపుల సూర్యం పాల్గొన్నారు.

పీజీ సెంటర్‌లో ఘనంగా ఫేర్‌వెల్ డే


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని కృష్ణా యూనివర్శిటీ డాక్టర్ ఎంఆర్.అప్పారావు పీజీ సెంటర్‌లో శనివారం కామర్స్, మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ అనుభవాలు, జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు గడిచిన రెండేళ్లుగా కలిసి చదువుకున్న తీరు, చేసిన అల్లరి, అధ్యాపకుల బోధన లక్ష్యసాధన క్యాంపస్ సెలక్షన్స్, భవిష్యత్తు ప్రణాళికలు, ఎన్నో గ్రూప్ డిస్కషన్స్, రెండేళ్ల స్నేహం, ఎవరికి వారే వెళ్లే సమయం ఆసన్నం కావడంతో ప్రతిఒక్కరీ మోములో తెలియని లోటు, ఎప్పటికీ కలిసి చోటు లభిస్తుందో అనే ఆలోచన నిండిన మనసులు. అంతా ఒక్కటై ఆత్మీయంగా పలకరింపులు శాశ్వతం కావాలంటూ ప్రతి ఒక్కరి మనోభావాలు వ్యక్తం చేసుకున్న మధురమైన క్షణం. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జె నవీన లావణ్యలతను సన్మానించారు. ప్రిన్సిపల్ లావణ్యలత మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో అమూల్యమైందని, ఎప్పటికీ ఈ అమూల్యమైన క్షణాలు తిరిగి రావని సోదాహరణంగా వివరించారు. ఎక్కడ ఉన్నా ఎలా ఉన్నా తరచూ కలుస్తూ ఒకరికొకరు అభిప్రాయాలు పంచుకుంటూ జీవితంలో స్థిరపడేందుకు ఒకరికొకరు సాయం చేసుకుంటూ వెళ్లేది స్నేహమని వివరించారు. మధురమైన స్నేహబంధం అందరికీ పవిత్రమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ షేక్ అన్వర్ భాష, డాక్టర్ కె.ప్రభాకరరావు, డాక్టర్ పి.తిరుమలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ప్రజాశక్తి - ముసునూరు

బాల్య వివాహాలు అనర్థాలకు దారి తీస్తాయని అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. కిశోర బాలికల వికాసం కార్యక్రమంపై అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నపిల్లలకు వివాహం చేయడం సాంప్రదాయంగా మారిందన్నారు. సాంప్రదాయం కన్నా అమ్మాయి వయసును దృష్టిలో పెట్టుకుని వివాహం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తవని, అదేవిధంగా గ్రామాల్లో చిన్న పిల్లలకు పెళ్లి చేస్తే తల్లి, బిడ్డ క్షేమంగా ఆరోగ్యకరంగా ఉండటానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని పెళ్లి వయసు వచ్చేవరకు వివాహం చేయరాదని అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఉన్న అంగన్వాడీ సిబ్బంది ఆయా గృహాలకు వెళ్లి మహిళలకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.


మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

గ్రామాలాభివృద్ధిలో ఉపాధి శ్రామికుల పాత్ర కీలకం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్


ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామాలాభివృద్ధిలో ఉపాధి శ్రామికుల పాత్ర ఎంతో కీలకమని దెందులూరు ఎంఎల్శ్రీ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలంలోని విజయరాయి వద్ద ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి పనులకు హాజరైన శ్రామికులతో శనివారం ఉదయం దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మమేకమయ్యారు. వేసవిలో సైతం శ్రామికులు ఎంతో శ్రద్ధతో ఉపాధి పనులు చేయటం గమనించిన దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ వారి శ్రమను అభినందిస్తూ కాసేపు వారితో ముచ్చటించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి 50 మంది శ్రామికులకు ఒక మేట్‌ను నియమించి, శ్రామికులకు పనుల కేటాయింపు, చెల్లింపుల అంశంలో మరింత సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకున్నటుల ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అనంతరం ఉపాధి శ్రామికుల కోసం ప్రత్యేకంగా శీతల పానీయాలు తెప్పించి స్వయంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ శ్రామికులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి పాలకవర్గాలు కుట్ర చేస్తున్నాయని, పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని తిరిగి పోరాడి రక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం ఏలూరు అన్నే వెంకటేశ్వరరావు భవనంలో శనివారం సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మే 20న ఒక రోజు దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతున్న సందర్భంగా ఉపాధి హామీ పనులు బంద్ చేయాలని, మండల కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని తెలిపారు. ఒక పక్క వ్యవసాయపు పనులు క్రమేపి తగ్గిపోతున్నాయని, రెక్కల కష్టమే ఆధారంగా జీవిస్తున్న పేదలకు వంద రోజుల ఉపాధి పనులే దిక్కు అవుతున్నాయన్నారు. పొమ్మన లేక పొగబట్టేతీరుగా ప్రభుత్వాలు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా వంద రోజులు పనులు చూపించాలంటే కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాని కేవలం రూ.83 వేల కోట్లు (30శాతం) మాత్రమే కేటాయించి, నిధులు మంజూరు చేయడంలో కేంద్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అంబానీ, అదాని వంటి ప్రపంచ కోటీశ్వరులకు బ్యాంకుల్లో రూ.12 లక్షల కోట్లకుపైగా అప్పులు రద్దు చేశారని, పేదలకు పట్టెడన్నం పెట్టే చట్టానికి మొండిచేయి చూపుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే 30 రోజులకు కూడా పనులు దక్కడం లేదని, పని చేసిన రెండు వారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా 13 వారాలుగా వేతనలివ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఎంపీలు, ఎంఎల్ఎలు తమ జీతాలు నెలకు రూ.50 వేలకు పైగా పెంచుకున్నారని, కానీ ఉపాధి కూలీలకు మాత్రం కేవలం ఏడు రూపాయలు పెంచారని తెలిపారు. గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ఉపాధి పనులు 200 రోజులకు పెంచాలని, రూ.600 వేతనమిస్తేనే జీవించగలరని ఆర్థికవేత్తలతోపాటు సుప్రీంకోర్టు సైతం చెప్పిందన్నారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతారు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన పోరాటాల ద్వారా యుపిఎ ప్రభుత్వ కాలంలో ఒత్తిడి ఫలితంగా వచ్చిన ఈ చట్టాన్ని మనమే రక్షించుకోవాలని కోరారు. అందుకు తిరిగి పోరాటమే మార్గమన్నారు. మే 20న ఉపాధి పనులు బంద్ చేయాలని పిలుపునిచ్చారు. ఆ రోజున జరిగే మండల కార్యాలయాలు, గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు, ప్రదర్శనలు, ధర్నాలులో గ్రామీణ ప్రాంత పేదలు వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, ముత్యాలమ్మ, జి.వెంకట్రావు, జిల్లా సహాయ కార్యదర్శి కారం నాగదుర్గ, సీనియర్ నాయకులు సత్యోటేశ్వరరావు, జిల్లా నాయకులు సాయి కృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

గ్రామీణ శ్రామికులకు సుస్థిర జీవనోపాధి, సాంఘిక భద్రత కల్పించాలని వృత్తిదారుల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.అనూష, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు కోరారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ చాట్రాయి ఎంపిడిఒ విజయలక్ష్మికి శనివారం అర్జీ అందించారు. ఈ సందర్భంగా ఎపివివియు జిల్లా కార్యదర్శి ఎ.అనూష, అయ్యార్లా జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ రోజువారీ కూలీలుగా జీవిస్తున్న ప్రజలు ప్రభుత్వ దృష్టిలో లబ్ధిదారులుగానే మిగిలిపోతున్నారన్నారు. వారికి వ్యవసాయ రంగంలో కూలి పనులు కూడా కరువవుతున్నాయని, పొట్ట చేత పట్టుకుని పట్టణాలకు వలస పోవడం తప్ప గత్యంతరం లేని పరిస్థితిలో ఉన్నారన్నారు. వలసలు నివారించడానికి రూ.కోట్ల నిధులతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం వలసలు ఆపటానికి, ఆకలి తీర్చడానికి ఏమాత్రం ఉపయోగపడటం లేదన్నారు. కుటుంబంలో ముగ్గురు, నలుగురు పని చేసే వారు ఉన్నా వంద పని దినాలకు అతి తక్కువ వేతనాలకు పరి మితం చేసి, అవి కూడా అరకొరగా అందటం వల్ల ఆ చట్టం ఎప్పుడో నీరు గారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో పట్టణాల్లో ఎటువంటి భద్రత లేకపోవడంతో పని కోసం వలస వెళ్లడానికి కూడా భయపడుతున్నారన్నారు. గత 20 ఏళ్లుగా కూలీలు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు చేసిన పోరాటాల వల్ల 2008లో అసంఘటిత రంగ కార్మికుల సాంఘిక భద్రత చట్టం వచ్చిందని, దాన్ని 2020లో అసంఘటిత రంగ కార్మికుల భద్రత కోడ్‌లో చేర్చారని, ఇది ఎప్పటికీ అమలవుతుందో తెలియటంలేదని, ఆంధ్రప్రదేశ్‌లో వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈ కోడ్‌ను అమలు చేయడం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు తగిన సంపాదన లేకపోవటం వల్ల, రోజురోజుకు ఆకాశానంటుతున్న నిత్యావసరాల సరుకుల ధరలతో ఆహారం, వైద్యం, ఇతర అవసరాలు ఎలా తీర్చుకోవాలో అర్థం గాని అగమ్యగోచరంలో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని డి.పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం కార్మికుల హక్కు అని, దానిని కచ్చితంగా అమలు చేయాలని, జాబ్ కార్డు కుటుంబానికి కాకుండా ప్రతి వర్కర్‌కు ఇవ్వాలని, సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని, పనిచేసే ప్రాంతంలో సేద తీరడానికి నీడ, తాగు నీరు, ప్రథమ చికిత్స బాక్సు, పిల్లలకోసం ఆయా, తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ సభల్లో మాత్రమే పనులు ఆమోదించాలని, ఏడో వేతన సంఘం సిఫార్సు మేరకు కనీస వేతనం రోజుకు రూ.850 చెల్లించాలన్నారు. సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలన్నారు. వారం లోపు వేతనాలు చెల్లించాలన్నారు. ఆలస్యమైతే అపరాధ రుసుంతో చెల్లించాలన్నారు. మొబైల్ ద్వారా మస్టర్ వేయడం రద్దు చేయాలన్నారు. తదితర డిమాండ్ల సాధన కోసం అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయ్యర్లా) ఆంధ్రప్రదేశ్ వృత్తిదారుల యూనియన్ కలిసి పని చేస్తాయని ఎ.అనూష, డి.పుల్లారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా బకాయిలు చెల్లించాలి

తహశీల్దార్ రవికుమార్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో నీటి తీరువా పన్ను వసూళ్లు రూ.3.30 కోట్లు పైబడి ఉందని తమశీల్దార్ పాలకుర్తి రవికుమార్ తెలిపారు. శనివారం ఉంగుటూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులు తమ దగ్గరలోని గ్రామ సచివాలయంలో నీటి తీరుగా పన్ను చెల్లించి సహకరించాలని కోరారు. 39,479 ఎకరాల్లో ఎకరాల్లో, వరి ఆక్వా సంబంధిత చెస్ రావాల్సి ఉందన్నారు. ఉంగుటూరు, వెల్లమిల్లి, బాదంపూడి, బొమ్మిడి, కాగుపాడు, రాలుపర్రు, చేబ్రోలు, కైకరం, తల్లాపురం, రాచూరు, కాకర్లమూడి, వి.ఎ.పురం గ్రామాల రైతులు వెంటనే పన్ను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మైనర్లకు వాహనాలు ఇచ్చి వాహనాలు నడిపేందుకు అవకాశం కల్పిస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తున్నామని, కచ్చితంగా తల్లిదండ్రులు వారి పిల్లలపై నిఘా ఉంచాలని ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణ్‌రావు సూచించారు. నగరంలో శనివారం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ వాహన తనిఖీల్లో పట్టుబడ్డ మైనర్లకు ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు శనివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మైనర్లకు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో భాగంగా మోటార్ వాహన చట్టం ప్రకారం మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.